క్లుప్తంగా

5కే రన్ ప్రారంభం



జెండా ఊపి పరుగుపందెం ప్రారంభిస్తున్న జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రాణి

విజయనగరంఫోర్ట్: స్థానిక విజ్జీ స్టేడియంలో 5కే రన్‌ను జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి శనివారం ప్రారంభించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్)పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హెచ్‌ఐవీ సోకిన వారి పట్ల వివక్ష చూపొద్దని, వారిని సాధారణ మనుషులు లాగానే చూడాలని ఆమె కోరారు. ప్రతిఒక్కరూ హెచ్‌ఐవీ రాకుండా చూసుకోవాలని, వైరస్ సోకిన తర్వాత బాధపడడం కన్నా అది సోకకుండా చూసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బద్రి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

భోగాపురం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పెద్దవీధిలో అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. వెయ్యి మందికి పైగా భక్తులు విఘ్నేశ్వరుని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



మనగ్రోమోర్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలను రికార్డుల ఆధారంగా సరిచూసి కాలం చెల్లిన పురుగుమందులను విక్రయించవద్దని సూచించారు. అలాగే అధిక ధరకు ఎరువులు విక్రయించవద్దని, ఎవరైనా ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ ఆర్.రవిప్రసాద్, వ్యవసాయాధికారి కె.నీలిమ, ఎస్‌ఐ దుర్గాప్రసాద్, వీఆర్‌వో రామకృష్ణ హెచ్చరించారు.

విద్యాప్రమాణాలు పెంచండి



రామతీర్థంలో జరిగిన సమావేశంలో సూచనలిస్తున్న ఎంఈవో సూర్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంచేందుకు కృషి చేయాలని ఎంఈవో సూర్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని రామతీర్థం, పారసాం గ్రామాల ఉన్నత పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభమైన పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు రమేష్, అప్పారావు, హెచ్‌ఎంలు త్రినాధరావు, పద్మాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరుణ్‌కుమార్

విజయనగరంఫోర్ట్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు వైద్యసేవలు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జైభీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా నాయకుడు అరుణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆయన ఫిర్యాదు చేసేందుకు శనివారం ఆస్పత్రికి వెళ్లి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శంబంగి అప్పలనాయుడుకు వినతి పత్రం అందజేశారు. రాత్రి వేళల్లో స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, దీని వల్ల రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆస్పత్రిలో శానిటేషన్ అధ్వానంగా ఉందని, యూరిన్ పరీక్షకు శాంపిల్ ఇవ్వడానికి అటాచ్‌డ్ బాత్‌రూమ్‌లు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారన్నారు. ఆయన వెంట కనిగిరి శ్రీనివాస్, నరసయ్య, రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణే కీలకం

- వరి సాగులో సస్యరక్షణతో అధిక దిగుబడులు
- పంటను ఆశించే తెగుళ్లపై అప్రమత్తం కావాలి
- పురుగుమందు పిచికారీలో జాగ్రత్త వహించాలి
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



నడిపల్లి వద్ద సాగు చేస్తున్న వరి పంట

పూసపాటిరేగ: రైతులంతా వరిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముందుగా పంటను ఆశించే తెగుళ్ల గూర్చి అవగాహన కలిగి ఉండి, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పండించే వరి పంటకు వివిధ తెగుళ్ల సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తం కావాలని సలహా ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 80 శాతం వరకు ఉభాలు పూర్తయినట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పుడు నెల్లిమర్ల నియోజకవర్గ వ్యాప్తంగా వరినాట్లు పూర్తి చేసిన వారంతా పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టడంలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం అధికంగా సాగులో ఉన్న వరి పంటకు పట్టే తెగుళ్ల, వాటి నివారణ చర్యలపై వ్యవసాయ అధికారుల సూచనలతో కథనం..

కాండంతొలిచే పురుగు: నారు నుంచి పూతదశ వరకు వరి పంటకు కాండంతొలిచే పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వ చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీని నివారణకు క్లోరిఫైరిఫాస్ 20 ఈసీ 2.5 ఎంఎల్, లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ, 1.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సుడిదోమ: సుడిదోమ వ్యాపిస్తే వరిపంట ఎండిపోతుంది. దీని నివారణకు వేపాకు కషాయం లేదా నీమాస్త్రం లేదా వావిలాకు కషాయం 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. లేకపోతే ఇతో ఫెన్‌ప్రాక్స్ 2 మిల్లీలీటర్లు లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలి.

ఆకుఎండు తెగులు: ఇది బ్యాక్టీరియా వల్ల వస్తుంది. దీని నివారణకు నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కువ సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటితడి తగ్గిస్తూ వేసుకోవాలి. క్లోరిఫైరిఫాస్ 20 ఈసీ 2.5 మిల్లీలీటర్లు లేక క్లోరాంట్రనిలిప్రోల్ 20 ఎస్‌సీ, 0.3 లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

పొట్టకుళ్లు తెగులు: ఈ తెగులు ఆశిస్తే వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్రనష్టం కలుగుతుంది. దీనిని నివారించేందుకు కార్బండైజమ్ 1.5గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొట్ట దశలో ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారీ చేయాల్సి ఉంటుంది.

నీటి యాజమాన్యం: పిలకలు వేసే దశలో పైరు వేయడం పూర్తయ్యే వరకు పొలంలో 2 సెంటీమీటర్లు నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వచ్చే వరకు క్రమేపీ నీరును తగ్గించుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: భూసార పరిక్షలకు అనుగుణంగా రసాయన, సేంద్రియ, జీవ ఎరువులు వాడి పైరుకు సాగుకు సమతుల్యంగా పోషకాలు అందించాలి. ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, 32 కిలోల పొటాష్ అందేలా ఎరువులను వేసుకోవాలి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి పంటలో అధిక దిగుబడులకు సస్యరక్షణ చేపట్టడంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిన్నచిన్న మెలకువలు అనుసరించడం వల్ల పెట్టుబడులు తగ్గి దిగుబడులు బాగుంటాయి. సాగు బాగు కోసం క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. -కె.తేజేశ్వరరావు, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త, విజయనగరం

వాడీవేడిగా మండల సమావేశం



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీపీగా కొనసాగిన సమావేశం

విజయనగరం: మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఈ సమావేశం..ఎమ్మెల్యే అదితి గజపతిరాజు వర్సెస్ ఎంపీపీ మామిడి అప్పలనాయుడు రీతిలో ఆసక్తికరంగా కొనసాగింది. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు రాజ్యాంగబద్ధంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కనిపించడం లేదని, సమావేశానికి వచ్చిన వారికి సమావేశం అజెండా కాపీలు ముందుగా అందించడం లేదన్నారు. అలాగే సమావేశంలో చర్చ తర్వాత ఆమోదం పొందిన ఏ విషయాన్ని మినిట్స్ పుస్తకంలో నమోదు చేయడం లేదని ఆరోపించారు. ఈ మేరకు ఎంపీపీ అప్పలనాయుడు ఘాటుగా స్పందిస్తూ ఇప్పటివరకు తన హయాంలో జరిగిన ఏ సమావేశం రాజ్యాంగబద్ధంగా జరగలేదన్న విమర్శ లేదని, నిర్వహించిన సమావేశాలన్నీ రాజ్యాంగబద్ధంగానే చేపట్టామని స్పష్టం చేశారు. అయినా ఇవన్నీ చూసుకోవాల్సిన బాధ్యత ఎంపీడీవోదేనన్నారు. ప్రభుత్వం మారిన దగ్గర నుంచి మండల పరిషత్‌లో విచిత్రమైన పరిస్థితులు నెలకొంటున్నాయని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ఇప్పుడు సమావేశానికి హాజరవ్వడానికి సమావేశ మందిరంలోకి వచ్చే ముందు అధికారులెవరూ కనీస గౌరవం ఇవ్వడం లేదని, సమావేశానికి అధ్యక్షుడిగా తానే వస్తున్నా ఎవరూ లేచి నిలబడలేదని, కనీసం పలకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఇవేవీ పట్టించుకోకుండా తాను చట్టబద్ధంగా నడుచుకుంటూ రాజ్యాంగబద్ధంగా సమావేశాలు చేపడుతున్నామన్నారు.

రాజకీయాలకు అతీతంగా..

రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నామని, మండల అభివృద్ధే ధ్యేయంగా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇకపోతే సమావేశంలో మాట్లాడిన ప్రతి అంశాన్ని మినిట్స్ పుస్తకంలో చేర్చాల్సిన అవసరం లేదని, అవసరమైన దానినే మినిట్స్ పుస్తకంలో చేర్చడం జరుగుతుందన్నారు. సభలో చర్చించి ఆమోదించిన అంశాలను కూడా మినిట్స్ పుస్తకంలో చేరుస్తున్నామన్నారు. అలాగే ప్రజాసమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు ఎవరు ఏ సలహా ఇచ్చినా స్వీకరిస్తామన్నారు. వైద్యారోగ్య శాఖపై జరిగిన చర్చలో పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) పరిసరాలను శుభ్రం చేసి దాని సరిహద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయాలని ఎంపీపీ సూచించారు. మరో వారం రోజుల్లో సభ్యులతో వచ్చి తనిఖీ చేస్తామని, పనులు ఎంతవరకు చేశారో చూస్తామన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నరసింహారావు, ఉపాధ్యక్షులు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు రెండు నెలలే గడువు..



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం అమలుకు మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉందని, దీనిపై అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఇదే విషయమై ఆయన నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ప్రణాళికా కార్యదర్శులు, ఇతర అధికారులతో సమావేశమై మాట్లాడారు. నగర క్రమబద్ధీకరణతో పాటు ప్రజాసమస్యల పరిష్కారంలో కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అనధికార కట్టడాలు, నిర్మాణాలను ఉపేక్షించవద్దన్నారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చిరు వ్యాపారులను క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు హరిబాబు, రమణమూర్తి, టీపీవో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాతృ,శిశు మరణాలు లేకుండా చర్యలు చేపట్టాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరంఫోర్ట్: మాతృ,శిశు మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి సూచించారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మాతృ,శిశు మరణాలపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు వారి ఆరోగ్యంపై పర్యవేక్షణ చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణుల మెరుగైన ఆరోగ్యానికి కృషి చేయాలన్నారు. ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకునేలా సలహా ఇవ్వాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు వారికి ఐరన్ మాత్రలు అందించాలన్నారు. ఆస్పత్రికి గర్భిణులను రిఫర్ చేసేటప్పుడు ఉన్నత శ్రేణి ప్రభుత్వ ఆస్పత్రికి నేరుగా పంపించే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు ఉండాలన్నారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గర్భిణులకు చేసే నెలవారీ తనిఖీలు పక్కాగా చేయాలని తెలిపారు. సమావేశంలో డీఎల్‌వో డాక్టర్ కె.రాణి, డాక్టర్ సత్యశ్రీనివాస్, డాక్టర్ సుజాత, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఎన్‌హెచ్‌ఐ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ సంతోష్‌బాబు..సైబర్ సెక్యూరిటీ ఏ విధంగా చేసుకోవాలి..వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 2 నుంచి నవతరోత్సవాలు

విజయనగరం: స్థానిక ఎస్వీఎన్ హోటల్‌లో విజయనగరం రోటరీ సెంటర్ క్లబ్ నవతరోత్సవాలు సెప్టెంబరు 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు రోహిత్ సంజయ్ శనివారం తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా రాజీవ్ క్రీడామైదానంలో పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, 3న ఖోఖో, 4న కబడ్డీ, 5న రన్నింగ్, 6న షటిల్ బ్యాడ్మింటన్, 7న ఎస్వీఎన్ లేక్ ప్యాలెస్‌లో సైన్స్ ఫెయిర్, క్విజ్, 8న వక్తృత్వం, 9న బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, విచిత్ర వేషధారణ, 10న చిత్రలేఖనం, 11న చెస్, 12న పోస్టర్ డిజైనింగ్, 13న భగవద్గీత పఠనం, 14న కేల్‌పురంలోని టర్ఫో ఎక్స్‌లో బాక్స్ క్రికెట్ పోటీలు చేపడుతున్నామన్నారు. సెప్టెంబరు 30వ తేదీన ఉత్సవాలు ముగుస్తాయని, ఆదేరోజున విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి

డెంకాడ: ఇంజినీరింగ్ విద్యార్థులంతా తమలోని సృజనాత్మకత కనబరిచి, నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని విశాఖ ఇన్ఫోసిస్ హెడ్ నర్రా సురేష్ ఆకాంక్షించారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం శనివారం జరిగింది. ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న వారంతా మొదటి ఏడాది నుంచే బాగా చదువుకుంటే నైపుణ్యాలు అలవడి, మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: నిరుపేదల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ కోరారు. జామి మండలంలోని నెయ్యిలవీధి, విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గరున్న జగనన్న కాలనీలోని ప్రజలు మౌలిక సదుపాయాలు లేక పడుతున్న అవస్థలపై శనివారం పత్రికల్లో ప్రచురితమైన కథనం చూసి ఆయన స్పందించారు. ఆ పార్టీ నాయకులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించి, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, నీరు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎస్.కోట నియోజకవర్గ కార్యదర్శి భీముడు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుదర్శనం

నెల్లిమర్ల రూరల్: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుదర్శనం హెచ్చరించారు. మండలంలోని సారిపల్లి, తంగుడుబిల్లి, రామతీర్థం గ్రామ సచివాలయాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రికార్డులను పరిశీలించి, విధులకు గైర్హాజరవుతున్న సిబ్బందిపై ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగులంతా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, ఎవరైనా సర్వేల కోసం గ్రామాల్లో పర్యటిస్తే అందుబాటులో ఉన్న సిబ్బందికి ముందుగానే తెలియజేయాలన్నారు. అలాగే ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు

విజయనగరం టౌన్: మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని, గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అదే స్కూల్‌లో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ శనివారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువత, విద్యార్థులంతా ఫ్యాషన్‌మాయలో పడి చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలు చిన్నాభిన్నం చేసుకుంటున్నారని, తద్వారా వారి తల్లిదండ్రులు ఎంతో ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. దేశ భవిష్యత్ యువత, విద్యార్థులదేనని అటువంటి వారు మంచి అలవాట్లు పెంపొందించుకుని ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ కిరణ్, కె.శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.



విజయనగరం టౌన్: మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థులు



పూసపాటిరేగ: మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తున్న ఎస్‌ఐ దుర్గాప్రసాద్

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉపాధ్యాయ రత్న, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2025 కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సామాజిక, సాంస్కృతిక సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఐఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉత్తమ విద్యాబోధనతో పాటు క్రీడా, యోగా, సాంస్కృతిక, ఆర్ట్స్ విభాగాల్లో విద్యార్థులను మంచిగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 9652347207ను సంప్రదించాలని కోరారు.